# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 13 సంచిక : 37 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 11 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :37 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SUN 11 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## విజయవాడలో టెన్షన్.. షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు




- ‘చలో రాజ్‌భవన్’ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు
- సీఈసీ రాజీనామా కోరుతూ ఇండియా కూటమి నిరసన
- కార్యక్రమానికి అనుమతి లేదని స్పష్టం చేసిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో

- మిగతా 2లో

## ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం



- అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నారాయణ ఆదేశాలు
- అక్టోబర్ 2028 నాటికి రాజధాని పూర్తి చేయడమే లక్ష్యమని వెల్లడి
- ఐకానిక్ టవర్ల పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి, ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం

- మిగతా 2లో

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- కూటమి పక్షాల ద్వారా 34 శాతతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.




# జగన్‌కు ఈడీ షాక్..

## అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

- జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన
- దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు
- విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ‘ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్’ (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది.సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది.గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.



## ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?

### కేంద్రంపై నారాయణ తీవ్ర ఆగ్రహం

- ఢిల్లీలో నిర్బంధంపై కేంద్ర ప్రభుత్వంపై సీపీఐ నారాయణ ఫైర్
- తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపుపై హర్షం
- కమ్యూనిస్టులను ఓడించాలన్న కాంగ్రెస్‌పై విమర్శలు

పెన్ పవర్ డెస్క్:సీపీఐ సీనియర్ నేత నారాయణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించారని,

- మిగతా 2లో

## ఉత్తరాఖండ్‌లో వరుస భూకంపాలు..

### ఒకే రోజు రెండుసార్లు ప్రకంపనలు




- ఉత్తరాఖండ్‌ను వణికించిన మరో భూకంపం
- ఉత్తరకాశీలో 4.2 తీవ్రతతో ప్రకంపనలు
- శనివారం ఒక్కరోజే రెండుసార్లు కంపించిన భూమి
- బాగేశ్వర్‌లోనూ స్వల్ప తీవ్రతతో భూకంపం
- కొద్దిరోజుల క్రితం చమోలీలోనూ కంపించిన ధరణి

- మిగతా 2లో

## గెస్ట్‌హౌస్‌పై కర్ణాటకకు టీటీడీ వార్నింగ్.. స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

- తిరుమల గెస్ట్‌హౌస్‌పై కర్ణాటక ప్రభుత్వంతో టీటీడీకి వివాదం
- పవిత్ర స్థలాన్ని వ్యాపార కేంద్రంగా మార్చాలని చూస్తున్నారని ఆరోపణ
- నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే గెస్ట్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:తిరుమలలోని కర్ణాటక ప్రభుత్వ గెస్ట్‌హౌస్ వ్యవహారంపై టీటీడీ తీవ్రంగా స్పందించింది. వివాదాస్పద నిర్ణయాన్ని కర్ణాటక సర్కార్ వెనక్కి తీసుకోకపోతే, ఆ గెస్ట్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంటామని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. పవిత్ర పుణ్యక్షేత్రాన్ని వ్యాపార కేంద్రంగా మార్చేందుకు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు

- మిగతా 2లో





## ఢిల్లీలో ఉద్రిక్తత.. కేజ్రీవాల్, మమతా బెనర్జీ అదుపులోకి.. పోలీసులపై రాళ్ల దాడి

పెన్ పవర్ డెస్క్: సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనతో దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికిపోతుంది. జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆందోళనకారులు పెద్ద ఎత్తున ఢిల్లీకి చేరుకున్నారు. అయితే, సీజేపీ ప్రొటెస్ట్?కు అనుమతి లేదంటూ

- మిగతా 2లో



## ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు.. సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- ఆదివారం ప్రత్యేకంగా సుప్రీంకోర్టు విచారణ
- మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్
- ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్
- నిరసనకారుల నిర్బంధంపైనా మరో పిటిషన్
- ప్రజా రవాణా పూర్తిగా నిలిపివేయొద్దన్న కోర్టు

- మిగతా 2లో

## కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ భేటీ.. తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్!

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసు కుంది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తమిళనాడు సీఎం, టీవీకే అధినేత సి. జోసెఫ్

- మిగతా 2లో



## ‘ప్రభుత్వానికి భయం పట్టుకుంది’.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

పెన్ పవర్ డెస్క్: ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ఢిల్లీలో పై 'చేయి' ఎవరిది ?!

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరుద్యోగ యువతను కాక్రోచెస్ పోల్చడంతో వ్యంగ్యంగా మొదలైన కాక్రోచ్ జనతాపార్టీ నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతూ జంతర్ మంతర్ లో చేసిన ఆందోళనలతో బలపడింది. సీజేపీ ఆందోళనలు మొదట తేలిగ్గా తీసుకున్న కేంద్రం చివరకు ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించాల్సి వచ్చింది. సర్ ప్రక్రియలో భాగంగా దేశంలో సుమారు 13 కోట్ల ఓట్లు తొలగించిన నేపథ్యంలో ఎన్నికల కమీషన్ లో ఉన్న ఇద్దరు కమీషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు 14 సార్లు సర్ కు ప్రక్రియ కొనసాగుతున్న వివాదం మీద అభ్యంతరాలు నమోదు చేసినట్లు వార్తలు బయటకు వచ్చాయి. దీంతో అర్హులైన ఓటర్లను ఓటు హక్కు నుంచి దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఓటు డాటా బేస్ నిర్ణయాల్లో పారదర్శకత లేకపోవడాన్ని ప్రతిపక్షాలు, సీజేపీ దీనిని ఓటు చోరీగా పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సీజేపీ 'జంతర్ మంతర్ 2.0' పేరుతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద నిరసనలకు పిలుపునిచ్చింది. సీజేపీ ఆందోళనలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. 25 వేల పారామిలటరీ బలగాలను మోహరించారు. రైళ్లను రద్దు చేశారు. 45 మెట్రో స్టేషన్లలో ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ పెద్ద ఎత్తున మళ్లించారు. దీంతో ఢిల్లీలో ట్రాఫిక్ జామ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆందోళన చేసేందుకు ఢిల్లీకి వచ్చిన సీజేపీ అధినేత అభిజిత్ దీప్కే, నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ముంబై నుంచి ఢిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ లో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో అరెస్ట్ చేశారు. ప్రముఖ యూట్యూబర్ ధృవ్ రాఠీని గురుగ్రామ్ లో, సీజేపీ లీగల్ టీమ్ హెడ్ రత్నసింగ్ ను వారి నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. రైళ్లు రద్దు చేస్తూ ఆందోళనలు అదుపులోకి తేవాలని చేసిన ప్రభుత్వ చర్యలపై 'ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగిస్తారా' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ చర్యలను సీజేపీ నియంతృత్వం, యువతను ప్రభుత్వం భయపెడుతోందని, మోడీ ఓటమి అంగీకరించాడని చెబుతుంది. ఢిల్లీని కంటోన్మెంట్ గా మార్చారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. గతంలో జరిగిన ఆందోళనలు మొదట తేలిగ్గా తీసుకున్న ప్రభుత్వం తర్వాత అణచివేతకు కఠినంగా వ్యవహరించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు కేంద్ర మంత్రి రాజీనామా చేయక తప్పలేదు. ప్రస్తుత ప్రభుత్వ చర్యలు నివారణాత్మకమేనా ? లేక అణచివేతనా ? అరెస్టు అయినవారు, అదుపులోకి తీసుకున్న వారు ఎప్పుడు విడుదల అవుతారు ? నిరసన ఎలా ముందుకు సాగుతుంది అన్న ఉత్కంఠ నెలకొంది. ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలో ఎవరిది పైచేయి అవుతుందో తెలియాలంటే వేచిచూడాల్సిందే.

# విజయవాడలో టెన్షన్.. షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

- మొదటి పేజీ తరువాయి

ఉన్న ఆమె నివాసం వద్ద ఉదయం నుంచే భారీగా పోలీసులను మోహరించారు. ఇండియా కూటమి పార్టీలు విజయవాడలో తలపెట్టిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు తొలగించారని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ ఉదయం 10 గంటలకు విజయవాడలోని లెనిన్ సెంటర్ నుంచి రాజ్‌భవన్ వరకు యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే షర్మిలతో పాటు పలువురు కాంగ్రెస్, వామపక్ష పార్టీల కీలక నేతలను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తున్నారు. మరోవైపు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజ్‌భవన్ వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల ఆంక్షల నడుమ షర్మిల ఇంటి నుంచి బయటకు వస్తారా, లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్ర ఆసక్తి నెలకొంది.

# ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం

- మొదటి పేజీ తరువాయి

సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, ఇప్పుడు పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి డయాగ్రిడ్ పూర్తయిందని, ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు ఫౌండేషన్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని, నవంబర్ 11 తర్వాత వాటి ప్రారంభోత్సవాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నామని తెలిపారు. రాజధాని నిర్మాణంపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని నారాయణ మండిపడ్డారు. విమర్శలు చేసేవారు అమరావతికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే

వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రతి నిర్మాణ సంస్థకు స్పష్టమైన టార్గెట్లు విధించామని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని, డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించి సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని వెల్లడించారు.

# ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు.. సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ. జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది.

**నిరసనకారుల నిర్బంధంపైనా విచారణ**

ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.

శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు. నిరసనకారులను రోడ్లపై నుంచి, ప్రతిపక్ష నేతలను వారి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకెళ్లడంపైనా ప్రశ్నించారు.

ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలు కోరుతూ పిటిషన్

కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ఛైర్‌పర్సన్ డి.థారాపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని త్రిపాఠి కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఆరోపించారు.

మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై కోర్టు ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

**అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఏమంది?**

ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు సూచించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆంక్షలు విధించారు. ఆ తర్వాత డీఎంఆర్‌సీ మూసివేతల సంఖ్యను 45కి తగ్గించింది.

ఈ ఆంక్షలపై విచారణ సందర్భంగా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలను నియంత్రించవచ్చని, కానీ పూర్తిగా నిషేధించకూడదని స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ట్రాఫిక్ సూచనలు ఇవ్వాలని, శాంతియుత నిరసనలకు తగిన సౌకర్యాలున్న ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నది ఆదివారం విచారణలో కీలకంగా మారనుంది.

# ఉత్తరాఖండ్‌లో వరుస భూకంపాలు..

ఉత్తరాఖండ్‌లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో రెండుసార్లు భూమి కంపించింది. సాయంత్రం ఉత్తరకాశీ జిల్లాలో భూకంపం సంభవించగా, అంతకు కొన్ని గంటల ముందు బాగేశ్వర్ జిల్లాలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస ఘటనలతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈరోజు రాత్రి 8:07 గంటల సమయంలో ఉత్తరకాశీ జిల్లాలో భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా నమోదైంది. భూమికి 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంతకుముందు మధ్యాహ్నం 3:40 గంటలకు బాగేశ్వర్ జిల్లాలో కూడా స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.8గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 5 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎన్‌సీఎస్ తెలిపింది.

ఈ రెండు భూకంపాల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు ఇంతవరకు సమాచారం అందలేదు.

ఇటీవలి కాలంలో ఉత్తరాఖండ్‌లో భూకంపాలు తరచూ సంభవిస్తున్నాయి. అక్టోబర్ 6వ తేదీన చమోలీ జిల్లాలో 4.9 తీవ్రతతో భూకంపం రాగా, దాని ప్రభావం దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలపై కూడా పడింది. తాజా ప్రకంపనలతో దేవభూమిలో మరోసారి భూకంపాల భయం నెలకొంది.

# 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

- మొదటి పేజీ తరువాయి

దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు.

ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

# ఢిల్లీలో ఉద్రిక్తత.. కేజ్రీవాల్, మమతా బెనర్జీ అదుపులోకి..

- మొదటి పేజీ తరువాయి

నిరసనకారులను ఎక్కడికక్కడ అడ్డుకుని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో పోలీసులతో ఆందోళనకారులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కన్నాట్ ప్లేస్, ఆకాశవాణి భవన్ దగ్గర తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జంతర్ మంతర్ ప్రాంతానికి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆగ్రహానికి గురైన నిరసనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఈ దాడిలో ఇద్దరు పోలీస్ సిబ్బంది గాయపడ్డట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన పోలీసులు లాఠీచార్జ్ చేసి నిరసనకారులను చెదరగొట్టారు.

కన్నాట్ ప్లేస్, ఆకాశవాణి భవన్ దగ్గర పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. జంతర్ మంతర్ వెళ్లే అన్ని మార్గాలను క్లోజ్ చేసి పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. తీవ్ర నిర్బంధం ఉన్న నిరసనకారులు ధైర్యంగా రోడ్లపైకి వస్తున్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్న్?న్నారు. సీజేపీ నిరసన నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీలో ఇప్పటికే పోలీసులు కఠిన ఆంక్షలు అమలు చేశారు. ప్రజా రవాణా వ్యవస్థలను నిలిపివేయడంతో పాటు మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. మరోవైపు జంతర్ మంతర్ దగ్గర బొద్దింక జనతా పార్టీ చేపట్టిన నిరసనలో పాల్గొంటారనే అనుమానంతో ఢిల్లీలోని లోధి ఎస్టేట్ వెలుపల ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తదితరులను నిర్బంధించారు. టీఎంసీ అధినేత్రి, బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీని సైతం ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు.

# గెస్ట్‌హౌస్‌పై కర్ణాటకకు టీటీడీ వార్నింగ్.. స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

- మొదటి పేజీ తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమల కొండ, సప్తగిరులు మొత్తం శ్రీ వేంకటేశ్వర స్వామికే సొంతమని, ఇతరులకు కేటాయించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని స్పష్టం చేశారు. గతంలో మైసూరు మహారాజుకు టీటీడీ 7.5 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, దానిపై కర్ణాటక ప్రభుత్వం గెస్ట్‌హౌస్ నిర్మించుకుందని గుర్తుచేశారు. ఇటీవల కర్ణాటక కేబినెట్ ఈ గెస్ట్‌హౌస్‌ను తమ రాష్ట్ర పర్యాటక శాఖకు అప్పగించాలని నిర్ణయించిందని, ఈ నిర్ణయం వెనుక ఓ కాంగ్రెస్ మాజీ కేంద్ర మంత్రి హస్తం ఉందని భానుప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే వారికి నోటీసులు పంపుతామని, స్పందించకపోతే గెస్ట్‌హౌస్‌ను టీటీడీ ఆధీనంలోకి తీసుకుంటుందని తేల్చిచెప్పారు.

# ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?

- మొదటి పేజీ తరువాయి

ఇంతకీ ఢిల్లీని పాకిస్థాన్‌కు ఏమైనా అప్పగించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు.

శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అణచివేసేందుకు 50 వేల నుంచి 75 వేల మంది పోలీసు, ఇతర భద్రతా సిబ్బందిని మోహరించి సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేయడం అన్యాయమని అన్నారు. కేంద్రం తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రం పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు కూడా స్పందిస్తున్నాయని గుర్తుచేశారు.

ఇదే సమయంలో, తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ విజయం సాధించడంపై నారాయణ సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఎన్నికలను కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా రాజకీయ పోటీగా మార్చిన కాంగ్రెస్ పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు. అధికార అహంకారంతో కమ్యూనిస్టులను ఓడించాలని పిలుపునివ్వడం సరికాదన్నారు. ప్రజల ఉద్యమాలను అణచివేతతో ఆపలేరని, కేంద్రం తన తప్పులను సరిదిద్దుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

# కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ భేటీ.. తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్!

- మొదటి పేజీ తరువాయి

విజయ్‌ను అక్టోబర్ 10, 2026న చెన్నైలో భేటీ అయ్యారు. తొలుత విజయ్ నివాసంలో సుమారు గంటపాటు సమావేశమైన ఇరువురు నేతలు, ఆ తర్వాత సమీపంలోని కేఫ్‌కు వెళ్లి కాఫీ తాగారు. ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. విజయ్ నివాసంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర, జాతీయ రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశం అనంతరం ఇద్దరూ సమీపంలోని కేఫ్‌కు వెళ్లారు. అక్కడ కాపుచినో కాఫీ, తిరమిసు, కుకీలు తీసుకున్నట్లు పీటీఐ వార్తా కథనం పేర్కొంది. కాంగ్రెస్, టీవీకే కలిసి పనిచేస్తున్న క్రమంలో కూటమి ఉమ్మడి కనీస కార్యక్రమం, భవిష్యత్తు ఎన్నికల ప్రణాళికలపై చర్చించే అవకాశం ఉందని సమావేశానికి ముందు వార్తలు వచ్చాయి. అయితే చర్చించిన ప్రతి అంశంపై అధికారిక ఎటువంటి ప్రకటన వెలువడలేదు. చెన్నైలోని ఐలాండ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'ఛత్రోన్ కి గూంజ్' (మానవర్గళిన్ కురల్) విద్యార్థుల కార్యక్రమంలో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ తమిళనాడుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడనున్నారు రాహుల్ . విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాహుల్ గాంధీతో జరిగిన ఈ భేటీ..కాంగ్రెస్, టీవీకే రాజకీయ సంబంధాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఉబ్బెంగుల గెడ్డలో వంతెన నిర్మాణానికి కలెక్టర్ కు వినతి



- వంతెన లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు.
- టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, వంతెన నిర్మాణం చేపడతామని చెబుతూ కాలయాపన చేస్తున్న ప్రభుత్వం.
- గ్రామస్తులు వి సుబ్బారావు వి లోకనాథ్ వి కామేష్.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 10.** అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలం, లక్ష్మీపురం పంచాయతీ, ఉబ్బెంగుల గ్రామంలో పారే పెద్ద గెడ్డ వద్ద వంతెన నిర్మాణం చేపట్టాలని అల్లూరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాన్ని సమర్పించినట్లు ఉబ్బెంగుల గ్రామస్తులు వి సుబ్బారావు, వి లోకనాథ్, వి కామేష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ.. గ్రామం నుండి మండల కేంద్రానికి మరియు బాహ్య ప్రపంచానికి వెళ్ళే దారిలో ఒక పెద్ద వాగు ప్రవహిస్తోందని, ఈ వాగుపై ఇప్పటివరకు ఎలాంటి వంతెన నిర్మాణం జరగలేదన్నారు. దీనివల్ల వర్షాకాలంలో గ్రామ ప్రజలు బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అత్యవసర సమయాల్లో గర్భిణీ స్త్రీలను, వృద్ధులను మరియు రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లడం ప్రాణాంతకంగా మారుతోందన్నారు. వాగు దాటలేక సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయని, వర్షాలు పడినప్పుడు వాగు ఉధృతంగా ప్రవహించడం తమ గ్రామానికి వచ్చే వివిధ గ్రామాల విద్యార్థులు చాలా రోజులు చదువుకు దూరమవ్వాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ రేషన్ సరుకులు, నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి మరియు మేము పండించిన పంటలను సంతకు తరలించడానికి ఎలాంటి రవాణా సౌకర్యం లేక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని, వర్షాకాలంలో గ్రామస్తులు పడుతున్న అవస్థలు వర్ణనతీతం అన్నారు. వంతెన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయిందని అధికారులు చెబుతూ కాలయాపన చేస్తున్నారనీ, ఇప్పటివరకు వంతెన నిర్మానానికి ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వి రంపన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# నెరవేరిన క్రీడాకారుల చిరకాల కోరికలి

## లిరూ.9.50 కోట్లతో అత్యాధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన



**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 10:**గాజువాక ప్రాంత ప్రజలు మరియు క్రీడాకారుల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది.జీవీఎంసీ 88 వ వార్డు(కొత్త) ఉడా కోలనీ,గొంతినవానిపాలెంలో ఆదర్శ మైదానంలో వీఎంఆర్డీఏ నిధులు రూ. 9.50 కోట్లతో నిర్మించనున్న అత్యాధునిక స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు విశాఖ ఎంపీ శ్రీ భరత్,గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావులు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ గాజువాక ప్రాంతంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఉన్నారని,వారి ప్రతిభను మరింత ప్రోత్సహించేందుకు ఆధునిక క్రీడా సదుపాయాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.వైకాపా హయాంలో ఈ ప్రాంగణాన్ని దెబ్బతీయాలని చూశారని అయితే అప్పట్లో పల్లా శ్రీనివాస్ ముందు చూపుతో ఈ క్రీడా మైదానాన్ని కాపాడుకుంటూ వచ్చారని అది నేడు చరిత్రాత్మక ఘట్టంగా మారిందని అన్నారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించింది ఎన్డీయే సర్కారు అని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు.విశాఖ ఉక్కును కాపాడితే దానిని కూడా రాజకీయ కోణంలో విమర్శలు చేయడం వైకాపా నేతలకు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు.ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గ వ్యాప్తంగా ఎనిమిది క్రీడా మైదానాలను గుర్తించి,వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివిధ క్రీడా విభాగాలకు అనుగుణంగా అత్యాధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.దీనివల్ల స్థానిక యువతకు క్రీడల్లో మరింతగా రాణించే అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ అభివృద్ధి కార్యక్రమానికి సహకరించిన గొంతినవానిపాలెం గ్రామస్థులకు, ఉడా కాలనీ వాసులకు, క్రీడాకారులకు నేతలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.క్రీడారంగ అభివృద్ధికి అందరి సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ జనసేన ఇన్చార్జ్ కోన తాతారావు, బీజేపీ నేత దీనంకొండ కృష్ణంరాజు..... డిప్యూటీ మాజీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ రెడ్డి మాజీ కార్పొరేటర్ లో పల్లా శ్రీనివాసరావు. గంధం శ్రీనివాసరావు రాజన్న రామారావు. బొడ్డు గోవింద పాత్రుడు. లేళ్ల కోటేశ్వరరావ జనసేన రాష్ట్ర నాయకులు తిప్పలరమణారెడ్డి. 88 వార్డు కొత్త టిడిపి నాయకులు జనసేన ఇంచార్జ రౌతు గోవిందరావు. బిజెపి ఇన్చార్జ్ సరసపల్లె నూకరాజు. టిడిపి సీనియర్ నాయకులు తాత బాలకృష్ణ. 73 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సింగూరు అనంత్ ప్రధాన కార్యదర్శి నంబర్ దేవుడు . వినాయక నగర్ ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర నాగేశ్వరరావు. మహిళా సోదరీమణులు అడుసు మిల్లు దీప్తి. మరియు విఎమ్ఆర్డి అధికారులు జీవంసి అధికారులు పాల్గొన్నారు

ఇట్లు
ప్రసాదుల శ్రీనివాస్ గాజువాక నియోజవర్గ ఇన్చార్జి

# శ్రీ మతుకుమిల్లి శ్రీభరత్ గారికి, గౌరవ పార్లమెంట్ సభ్యులు (లోక్‌సభ),విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్.



**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 10:**విషయం: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీ అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు మరియు దసరా బోనస్ విడుదల చేయాలని విజ్ఞప్తి.

**గౌరవనీయులైన సార్ గారికి,**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (=×చీూ) ఉద్యోగుల తరపున, స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన ఆర్థిక ప్యాకేజీని అందించడంలో మీరు చేసిన నిరంతర కృషికి, కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మీ చొరవతో పాటు కేంద్ర ప్రభుత్వ మద్దతు వల్ల మన ప్రియమైన "విశాఖ ఉక్కు" పునరుజ్జీవనానికి, మనుగడకు కొత్త ఆశలు చిగురించాయి.అయితే, ప్లాంట్ నిర్వహణకు అవసరమైన ఆర్థిక సహాయం అందుతున్నప్పటికీ, ఉద్యోగులు వ్యక్తిగతంగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాము. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు విడుదల కాకపోవడంతో ఉద్యోగులు తమ కుటుంబాల అవసరాలను తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రస్తుతం పండుగల సీజన్ కావడంతో ఉద్యోగుల కుటుంబాలపై ఆర్థిక భారం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో, మీరు దయచేసి ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సంబంధిత అధికారులతో మాట్లాడి ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ వేతన బకాయిలతో పాటు సంప్రదాయంగా అందించే దసరా బోనస్‌ను కూడా వీలైనంత త్వరగా విడుదల చేయించవలసిందిగా మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాము.ఈ నిధులు విడుదలైతే, ప్లాంట్ అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలోనూ ఎంతో అంకితభావంతో పనిచేస్తూ, ప్లాంట్‌కు అండగా నిలిచిన వేలాది మంది ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఊరట లభిస్తుంది. అలాగే, పండుగను సంతోషంగా జరుపుకునేందుకు వారికి ఎంతో సహాయపడుతుంది.మీ నాయకత్వంపై మాకు పూర్తి నమ్మకం ఉంది. మీరు ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి, ఉద్యోగుల వేతన బకాయిలు మరియు దసరా బోనస్ త్వరితగతిన విడుదలయ్యేలా కృషి చేస్తారని ఆశిస్తున్నాము. దీనిపై పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ గారు మాటలు ఆడుతూ యాజమాన్యం తో మాటలు ఆడి పరిష్కారం చేస్తాము అని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమం లో రాష్ట్ర మినిమం వేజ్ బోర్డు మెంబర్ విల్లా రామ్మోహన్ కుమార్ రాష్ట్ర టి ఎన్ టి యు సి ప్రధానకార్యదర్శి కోగంటి లెనిన్ బాబు స్టీల్ టి ఎన్ టి యు సి ప్రధానకార్యదర్శి నమ్మి సింహాద్రి స్టీల్ టి ఎన్ టి యు సి అధ్యక్షులు నాగుబిల్లి లక్ష్మణరావు వర్కింగ్ ప్రెసిడెంట్ అంజిబాబు అడిషనల్ సెక్రటరీ కోన సోమినాయుడు వైస్ ప్రెసిడెంట్ ఎస్ వి అప్పలరాజు అరుగుల మణికుమార్ తురుబిల్లి శ్రీనువాసరావు మొల్లి రమేష్ నంబారు పెద్ద దేముడు తదితరులు పాల్గొన్నారు

# మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ-ప్రసాదుల శ్రీనివాస్



**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 10:**ఈ మధ్యకాలంలో వచ్చిన అర్నాబ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని గాజువాక తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ తెలిపారు.. మత్స్యకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న నిత్యవసర సరుకులను సివిల్ సప్లై అధికారులతో ఆయన మత్స్యకారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ... అర్నాద్ తుఫాను వలన వేటకి వెళ్లకుండా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు దానిలో భాగంగానే సివిల్ సప్లై ఆధ్వర్యంలో నియోజకవర్గంలో గల 16 వందల మంది మత్స్యకారులకు నిత్యవసర సరుకులను అందజేయడం జరిగిందని అన్నారు.. కార్యక్రమంలో సివిల్ సప్లయర్స్ ఆర్ ఐ లు లలిత, పద్మ,మాజీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు 64వ వార్డు అధ్యక్షులు కొవిరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సహకారంతోటి నేరాలు నియంత్రించవచ్చు...!



- కొయ్యూరు సీఐ బి శ్రీనివాసరావు వెల్లడి

**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 10 :** ప్రజల సహకారంతోనే నేరాలు నియంత్రించవచ్చునని కొయ్యూరు సీఐ బి శ్రీనివాసరావు వెల్లడించారు. ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా చింతలపూడి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా కోయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. శ్రీనివాసరావు, ఎస్ఐ పి. కిషోర్ వర్మ మాట్లాడుతూ... రహదారి భద్రత, మహిళలపై జరిగే నేరాల నివారణ, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాల నివారణపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

**ప్రజలకు విజ్ఞప్తి:** మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, నేరాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. యువత గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

అలాగే, రాబోయే ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి గొడవలు, వివాదాలకు తావివ్వకుండా శాంతిభద్రతలను కాపాడాలని, ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల సహకారంతోనే నేరాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుంది. ఈ సందర్భంగా సిఐ,ఎస్ఐ గ్రామస్తులకు తెలియపరిచారు.

# జీవీఎంసీ 102 వార్డు లో జడ్పీ ఎంపీపీ పాఠశాలల చైర్మన్ వైస్ చైర్మన్ ను సన్మానించిన వార్డ్ టిడిపి అధ్యక్షులు కర్రి దశేంద్ర



**గాజువాక :పెన్ పవర్ ,అక్టోబర్ 10**అగనంపూడి సి డబ్ల్యూ సి లో ఇటీవల జరిగిన ప్రభుత్వ పాఠశాలల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికల్లో 102 వార్డులో ఉన్న 3 జడ్పీ హైస్కూల్ 7ఎంపీపీ పాఠశాలలో ఎన్నికైన చైర్మన్,వైస్ చైర్మన్ ను మరియు ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయంలో ఎస్ఎంసి కమిటీల్లో ఎన్నికైన అగనంపూడి నివాసికులకు కర్రి దశేంద్ర దుస్సాల్వా కప్పి యాపిల్ ఫ్రూట్స్ అందజేసి ఘనంగా సన్మానించితిరి అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసి కమిటీలు కీలక భూమి వహించాలని ఉపాధ్యాయులకు పేరెంట్స్ కి సమన్వయంగా ఉంటూ విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు వచ్చేటట్టు కృషి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మాత్యులు విద్య అభివృద్ధికి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఆయన ఆశయాలు అనుగుణంగా పనిచేయాలని కోరారు. ఏరియా ఆసుపత్రి డైరెక్టర్ డొక్కా రమేష్ మాట్లాడుతూ ఈ ప్రాంత పాఠశాలలో విద్యార్థులకు ఏమీ బాగు లేకపోయినా ఆటల్లో పడిపోయిన తక్షణమే ఆసుపత్రికి తీసుకువచ్చినట్లైతే వారికి మెరుగైన వైద్య సౌకర్యం ఇప్పిస్తామని అన్నారు. ఎస్ఎంసి కమిటీలు తరపున జంపా నాగేశ్వరరావు, సఖనాల సుబ్రమణ్యం, మాట్లాడుతూ జీవీఎంసీలో 120 వార్డులు ఉన్నప్పటికీ 102 వార్డు టిడిపి అధ్యక్షులు కర్రి దశేంద్ర పాఠశాలలపై అభిమానంతో మమ్మల్ని ప్రోత్సహించే విధంగా మాట్లాడి సన్మానం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఏ డి సి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ సభా అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో 102 వ వార్డు టిడిపి కార్యదర్శి విందుల రాజు సీనియర్ టిడిపి నాయకులు పూడి సత్యారావు టిఎన్టీయూసీ నాయకులు మేడిశెట్టి ఉమామహేశ్వరరావు స్టీల్ ప్లాంట్ గుర్తించిన నాయకులు సాయిన సన్యాసిరావు గాజువాక నియోజకవర్గం తెలుగు మహిళ ఉపాధ్యక్షులు గంతకోరు సత్యవతి టిడిపి మహిళా నాయకురాలు రావాడ శిరీష గోపిశెట్టి పద్మ, పకృతి భవాని, మరియు 102 వార్డు ఎస్ఎంసి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వృత్తి నైపుణ్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు.

- సాంకేతిక విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు.
- పంచాయతీరాజ్ డీఈఈ సమిరెడ్డి మాణిక్యం.
- చింతపల్లి ప్రభుత్వ ఆర్-ఐటీఐలో ఘనంగా స్నాతకోత్సవం.




**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 10.** వృత్తివిద్యా కోర్సులు, సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉపాధి అవకాశాలకు కొదవ ఉండదని, తద్వారా పేదరికాన్ని జయించి ఉన్నత స్థాయికి ఎదగవచ్చని పంచాయతీరాజ్ డీఈఈ సమిరెడ్డి మాణిక్యం అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆర్–ఐటీఐలో ప్రిన్సిపాల్ రామమోహన్ ఆధ్వర్యంలో కన్వొకేషన్ (స్నాతకోత్సవం), దసరా వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా కోడా ఆనందరావు వ్యవహరించగా.. ముఖ్య అతిథిగా డీఈఈ మాణిక్యం హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్లు, షీల్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారికే డిమాండ్ ఉందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలకు పదును పెట్టి ప్రగతి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథి, డిప్యూటీ తహసీల్దార్ బాలరాజు దొర మాట్లాడుతూ.. యువత నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రామమోహన్‌రావు మాట్లాడుతూ.. తమ విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఇక్కడ కోర్సు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కల్పించడంతో పాటు, ఉపాధి లభించేలా సంస్థ తరఫున కృషి చేస్తున్నామన్నారు. ఐటీఐలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించారు. కళాశాల సూపరింటెండెంట్ నానిబాబు తన వంతుగా రూ.10 వేల నగదు బహుమతిని స్పాన్సర్ చేయగా, ఆ నగదును అతిథుల చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారి రమణ, సిబ్బంది సతీష్, సాగర్, రణదీప్, సుజాత, వెంకన్న దొర, లక్ష్మీనారాయణ, లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణే లక్ష్యంగా 'ఆపరేషన్ త్రిశూల్'.

- డ్రంక్ అండ్ డ్రైవ్, ఓవర్ లోడింగ్‌పై కఠిన చర్యలు: జీకే వీధి ఎస్ఐ సురేష్.
- ఆటోలకు రూట్ సీరియల్ నంబర్ల కేటాయింపు.



**చింతపల్లి/జి. కె. వీధి పెన్ పవర్ అక్టోబర్ 10.** పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి, ప్రయాణికులకు సురక్షిత ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఎస్పీ అమిత్ బర్దార్, చింతపల్లి ఏఎస్పీ మహేంద్రసిన్హాల ఆదేశాల మేరకు జీకే వీధి మండలంలో 'ఆపరేషన్ త్రిశూల్' కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఆపరేషన్ త్రిశూల్ రెండవ దశలో భాగంగా ఆదివాసి గిరిజన ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సును శనివారం రింతాడలో ఏర్పాటు చేశారు. ఆటో యూనియన్ ?మండల ప్రెసిడెంట్ ఎస్.వి. రమణ ఆధ్వర్యంలో, పెదవలస ఆటో యూనియన్ నాయకులు రత్నకుమార్ (చిన్న) అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీకే వీధి ఎస్ఐ కే. సురేష్.. ఆటోలకు రూట్ సీరియల్ నంబర్లను అంటించి అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో తిరుగుతున్న సుమారు 1,500 ఆటోల గుర్తింపు కోసం ప్రత్యేకంగా ఈ సీరియల్ నంబరింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆటో డ్రైవర్లు ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటివి ప్రాణాపాయానికి దారితీస్తాయని, అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ఆటోల ద్వారా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ప్రతి డ్రైవర్ నిబంధనల ప్రకారం విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను, వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేది బీమా మాత్రమేనని ఎస్ఐ సురేష్ గుర్తుచేశారు. అందువల్ల ప్రతి ఆటోకు వాహన బీమా (ఇన్సూరెన్స్) తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. కేవలం వాహనానికే కాకుండా, ప్రతి డ్రైవర్ తమ కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యక్తిగత ప్రమాద బీమా కూడా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి, రంపుల, నేరెళ్ల బంధ, పెదకొండ ప్రాంత ఆటో యూనియన్ నాయకులు కోటి, సంసుద్దీన్, పూజారి గిరి, రాము లతోపాటు, పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలపై అవగాహన

సోలభం గ్రామంలో పోలీసుల సమావేశం




**జి.మాడుగుల. పెన్ పవర్.అక్టోబర్ (10)**రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని జి.మాడుగుల ఎస్సై సాయిరాం పడాల్ సూచించారు. మండలంలోని సోలభం గ్రామాన్ని సందర్శించిన ఆయన ఎన్నికల నిబంధనలు, శాంతిభద్రతల పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు, అశాంతికి దారితీసే చర్యలకు దూరంగా ఉండాలని కోరారు.ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా రహదారి భద్రత, మహిళలు, బాలలపై నేరాల నివారణ, గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు వివరించారు. నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని, గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై సూచించారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల .



**పరవాడ: పెన్ పవర్:అక్టోబర్ 10:** వచ్చే మూడేళ్లలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పేర్కొన్నారు. శనివారం జీవీఎంసీ పరిధి 79 వ వార్డులో రూ "5 కోట్ల 40 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేయడానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. పెందుర్తి నియోజకవర్గంలో భారీ ఎత్తున నిధులు సమీకరించి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని స్పష్టం చేశారు. గత రెండేళ్ల రెండు నెలల తన పాలన కాలంలో అంచనాలుకు మించి నిధులు సేకరించి అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. ఇంకా మిగిలిపోయిన పనులన్నింటినీ పూర్తిచేసి ప్రజలకు కానుకగా అందిస్తానన్నారు. 2009లోనే తనను గుండెల్లో పెట్టుకొని చూసుకున్న ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకోవడానికి అవిశ్రాంతంగా పనిచేస్తానని పేర్కొన్నారు. నిజానికి ఈ కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా జరిపించుకోవాల్సి ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున నిరాడంబరంగా కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. తక్కువ కాలంలోనే విజయవంతంగా నిర్వహించిన శివ తదితరులను ఆయన అభినందించారు. కాగా ప్రధాన నరేంద్ర మోడీ సహకారంతో, అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంకల్పంతో రాష్ట్రం అన్ని రంగాల అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని వివరించిన ఎమ్మెల్యే ప్రజలు మనస్ఫూర్తిగా అభివృద్ధిని ఆశీర్వదించాలని కోరారు. కేంద్రం నుండి రాష్ట్రానికి నాలుగు లక్షలు మంజూరయ్యాయని, వాటిలో నియోజకవర్గానికి నాలుగైదు వేల ఇల్లు వస్తాయని అర్హులైన వారందరికీ వాటిని మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే నెలలో పెన్షన్లు మంజూరు కానున్నాయని అర్హులందరూ దరఖాస్తు చేస్తే తప్పనిసరిగా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో ప్రారంభోత్సవాలు చేశారు .ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ ,సీనియర్ నాయకులు పంచకర్ల ప్రసాద్ రావు ,వార్డు అధ్యక్షులు పిల్లా శివ కృష్ణ , మాజీ కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు , మాజీ జెడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాథ రావు , మండల పార్టీ అధ్యక్షులు బొడ్డపు శ్రీనివాసరావు , వియ్యపు చిన్నా ,మాజీ కార్పొరేటర్ దుల్లా రాము నాయుడు , బట్టు సూర్యకుమారి గారు,పార్టీ సీనియర్ నాయకులు గొన్న రమాదేవి ,మండల పార్టీ ఉపాధ్యక్షులు వెన్నెల నరసింహారావు , మాజీ సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు , అప్పలనాయుడు , స్థానిక కూటమి నాయకులు లక్కరాజు శ్రీనివాస రావు , నర్సింగ్ రావు , సతివాడ జ్యోతి , అమర్ పిన్ని గోపి ,కాకి బాబు , వెలుగుల అనిల్ , షణ్ముఖ శివ , బోండా పవన్ కళ్యాణ్ , పావని, 79 వ వార్డు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు వైకాపా సన్నద్ధం.



- గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం.
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి.
- కొత్తపాలెంలో వైకాపా శ్రేణుల విస్తృత పర్యటనలో మాజీ ఎంపీపీ అనూష దేవి.

**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 10.**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు వైసీపీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పార్టీ అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు పాంగి గణబాబు ఆధ్వర్యంలో చింతపల్లి మాజీ ఎంపీపీ కోరాబు అనూషా దేవి స్థానిక నాయకులతో కలిసి శనివారం కొత్తపాలెం పంచాయతీలో విస్తృత పర్యటన చేపట్టారు. పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ... రాబోయే స్థానిక ఎన్నికల్లో గెలుపు గుర్రాలను బరిలో నిలపడం ద్వారా పార్టీ బలాన్ని చాటిచెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. అభ్యర్థుల విజయానికి గ్రామస్థాయిలో ప్రతి ఒక్క కార్యకర్త అహర్నిశలు శ్రమించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా, ఎన్నికల ముందు చెప్పిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. హామీలు నెరవేర్చలేని ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తుచేస్తూ.. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో పంచాయతీరాజ్ నియోజకవర్గ అధ్యక్షుడు గంగన్నపడాల్, రైతు విభాగం అధ్యక్షుడు కృష్ణారావు, మండల రైతు విభాగం అధ్యక్షుడు రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ శారద, నాయకురాలు సంధ్య, మాజీ సర్పంచ్ బెన్నీబాబు, రఘునాథ్, గోపాల్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాడేరులో స్థానిక ఎన్నికలకు జనసేన కసరత్తు..

### స్థానిక ఎన్నికల సమన్వయకర్తలుగా త్రీమెన్ కమిటీ



**స్టాఫ్ రిపోర్టర్ పాడేరు, పెన్ పవర్, అక్టోబర్ 10:** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతలో భాగంగా పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలుగా కిట్లంగి పద్మ, ఎస్. రామమూర్తి, గొర్లె వీర వెంకట సత్యనారాయణ (వీర వెంకట్)లను జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నియమించారు.నియోజకవర్గ పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక పరిస్థితులు, ఎన్నికల సన్నద్ధత, పార్టీ సంస్థాగత కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి పార్లమెంట్ కోఆర్డినేషన్ కమిటీకి అందించడం వీరి ప్రధాన బాధ్యత. క్షేత్రస్థాయి సమాచారాన్ని సమన్వయ కమిటీకి చేరవేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ పరంగా సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించేందుకు కృషి చేయనున్నారు.పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో, అంకితభావంతో నిర్వహిస్తామని కిట్లంగి పద్మ, ఎస్. రామమూర్తి, వీర వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు.

# అరకు జనసేనకు ముగ్గురు ఎన్నికల సమన్వయకర్తలు.




- అభినందనలు తెలిపిన జనసేన ఇన్‌చార్జి చెట్టి చిరంజీవి .

**అరకు లోయ పెన్ పవర్ అక్టోబర్ 10:**అరకు నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్తలుగా చెట్టి ఆనంద్, బి. కోటేశ్వరరావు పడాల్, కె. లక్ష్మణ్‌లను నియమించారు.

ఈ సందర్భంగా జనసేన పార్టీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్టి చిరంజీవి ముగ్గురు నాయకులకు అభినందనలు తెలిపారు. పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన విజయానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు.ముఖ్యంగా చెట్టి ఆనంద్‌కు కీలక బాధ్యతలు అప్పగించడంపై చెట్టి చిరంజీవి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. బి. కోటేశ్వరరావు పడాల్, కె. లక్ష్మణ్‌లతో కలిసి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, జనసైనికుల మధ్య సమన్వయాన్ని పెంపొందించాలని కోరారు.

**ఐకమత్యంతో ముందుకు సాగాలి**

స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పార్టీ శ్రేణులన్నింటినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని చెట్టి చిరంజీవి పిలుపునిచ్చారు. జనసేన సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచాలని సూచించారు.

"పవన్ కళ్యాణ్ మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఐకమత్యం, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసి అరకు నియోజకవర్గంలో జనసేన విజయానికి కృషి చేయాలి" అని చెట్టి చిరంజీవి పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి అరకు నియోజకవర్గంలో జనసేన పార్టీ విజయపతాకాన్ని ఎగురవేయాలని ఆయన ఆకాంక్షించారు.

## అంగరంగ వైభవంగా విద్యుత్ అలంకరణతో దుర్గాదేవి ఆలయం

కొయ్యూరులో శరన్నవరాత్రి ఉత్సవాలు సిద్ధమైన కనకదుర్గ ఆలయం..



**కొయ్యూరు, పెన్ పవర్ అక్టోబర్ 10:**కొయ్యూరులోని కొండపై వెలసిన శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం దసరా శరన్నవరాత్రులకు అంగరంగ వైభవంగా విద్యుత్ అలంకరణతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ కమిటీ, గ్రామ భక్తులు ఆలయాన్ని శుభ్రం చేసి, పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ఎరుపు వస్త్రాలు ధరించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అక్టోబర్ 11 నుండి 20 వరకు 9 రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ప్రతిరోజూ అమ్మవారికి ఒక అవతారంలో అలంకరణ, అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.

## జనసేన కోఆర్డినేషన్ కమిటీ సభ్యునిగా శ్రావణ్

పార్టీ బలోపేతం కొరకు కృషి చేస్తా.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 10.**అరకు నియోజకవర్గ ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సభ్యునిగా ముంచంగిపుట్టు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ఆర్ శ్రావణ్ కుమార్ ఎన్నికయ్యారు. పార్టీ తన మీద ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపునకు కృషి చేస్తానని, పార్టీని మరింత బలోపేతం చేసి, నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ముందడుగు వేస్తామన్నారు. కాగా ఎన్నికల కోఆర్డినేషన్ కమిటీ సభ్యునిగా తనను నియమించిన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు

## కామ్రేడ్ బంగార్రాజు కు 15వ వర్ధంతి.



**గుమ్మలక్ష్మీపురం అక్టోబర్ 10 పెన్ పవర్.**మండలంలో ఇజ్జగై గ్రామంలో మాజీ సర్పంచ్ గిరిజన సంఘం నాయకులు కీర్తిశేషులు కామ్రేడ్ కిల్లక బంగారు రాజు 15వ వర్ధంతి సభ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపఅధ్యక్షులు శ్రీను ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ,బంగారు రాజు సర్పంచ్ గా చేసిన సమయంలో బీరుపాడు పంచాయతీకి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల కోసం పోరాడాడని, పంచాయతీలో ప్రతి గ్రామ అభివృద్ధి కోసం కష్టపడ్డాడని మరొకసారి గుర్తు చేశారు. గతంలో పంచాయతీలో మంచినీటి సమస్య పెన్షన్ సమస్య అలాగే కొండుపాడు పట్టాలపై ఇలా అనేక సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కారం అయ్యేంతవరకు ఆయన పోరాడని శ్రీను అన్నాడు. ఆయన అడుగుజాడల్లో నడుచుకుంటూ గిరిజనసంతా ఐక్యమై పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బంగారాజు,ప్రజలు యువతీ యువకులు పాల్గొన్నారు.

# హరిపురంలో రూ.3.85 కోట్లతో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం





- విశాఖను క్రీడా రాజధానిగా తీర్చిదిద్దుతాం
- ఎంపీ శ్రీభరత్, గణబాబు

**ములగాడ, పెన్ పవర్, అక్టోబర్ 10:** నగరంలోని శ్రీహరిపురం ఎంఐజీ కాలనీ (వుడా కాలనీ)లో రూ.3.85 కోట్ల జీవీఎంసీ సాధారణ నిధులతో నిర్మించిన అత్యాధునిక ఇండోర్ ట్రై నింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు గణ బాబు శనివారం ప్రారంభించారు. 60వ వార్డు పరిధిలో నిర్మించిన ఈ క్రీడా సముదాయం ప్రారంభోత్సవం సందర్భంగా వారు శిలాఫలకా న్ని ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన వుడెన్ కోర్టులో షటిల్ బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. చిన్నా రుల కరాటే, బాక్సింగ్ ప్రదర్శనలను తిలకించి వారిని అభినందించారు.

**క్రీడాకారులకు మెరుగైన వసతులు**

ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, గతంలో శిథిలావస్థకు చేరిన భవనం కారణంగా స్థానికులు, ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటు న్న భద్రతాపరమైన సమస్యలకు పరిష్కారం చూపడంతోపాటు, యువతకు మెరుగైన క్రీడా వసతులు కల్పించడం అభినందనీయమన్నా రు. స్థానిక ఎమ్మెల్యే గణబాబు చొరవతో ఈ ప్రాంతంలో ఆధునిక క్రీడా సముదాయం అందు బాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నా రు.విద్యార్థినులు, బాలికలు కరాటే, బాక్సింగ్ వంటి ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ పొందడం ద్వా రా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చ న్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా నాణ్యమైన క్రీడా శిక్షణ పొందేందుకు ఈ కాంప్లెక్స్ దోహదపడుతుందని చెప్పారు. నాలుగు వుడెన్ కోర్టులు, ఏసీ డార్మిట రీతోపాటు బ్యాడ్మింటన్, బాక్సింగ్, కరాటే, కబడ్డీ వంటి క్రీడలకు అవసరమైన వసతులు కల్పించడం అభినందనీయమన్నారు.కోట్లాది రూపాయలతో నిర్మించిన ఈ క్రీడా ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, వసతులు దెబ్బతినకుండా స్థానిక కాలనీ అసోసియేషన్, సంబంధిత అధికారులు బాధ్యతగా నిర్వహిం చాలని శ్రీభరత్ సూచించారు. విశాఖపట్నాన్ని రాష్ట్ర క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

**జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులే లక్ష్యం**

ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ, ఈ కాం ప్లెక్స్ కేవలం క్రీడలు ఆడుకునే ప్రాంగణం మాత్ర మే కాదని, చిన్న వయసు నుంచే నాణ్యమైన శిక్షణ అందించి జాతీయ, అంతర్జాతీయ స్థా యిలో పతకాలు సాధించే క్రీడాకారులను తీర్చి దిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం అని వివరించారు.2014--19 టీడీపీ ప్రభుత్వ హ యాంలోనే ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించామని, అనంతరం నిలిచిపో యిన పనులను కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత వేగవంతం చేసి పూర్తి చేశామని తెలిపారు.రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా జట్లకు 10 నుంచి 15 రోజులపాటు శిక్షణ శిబి రాలు నిర్వహించేందుకు అవసరమైన సదుపా యాలను సమకూర్చినట్లు చెప్పారు. ఒకేసారి 50 నుంచి 60 మంది క్రీడాకారులు బస చేసేం దుకు వీలుగా డార్మిటరీ ఏర్పాటు చేశామన్నా రు. ఎంపీ శ్రీభరత్ సహకారంతో విశాఖపట్నాన్ని క్రీడా హబ్‌గా అభివృద్ధి చేసి, ఆంధ్రప్రదేశ్ క్రీడా రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, కూటమి నాయకులు, ఎంఐజీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు, కోచ్‌లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఓట్లు తొలగింపుపై సీఈసీ రాజీనామా చేయాలి

నెహ్రూ నగర్ లేబర్ జంక్షన్‌లో సీపీఎం నిరసన




**ములగాడ, పెన్ పవర్, అక్టోబర్ 10 :** ఓటర్ల జాబితా నుంచి భారీ సంఖ్యలో ఓట్లు తొలగించడాన్ని నిరసిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించా రు. జీవీఎంసీ పరిధిలోని 59వ వార్డు కొత్త వార్డు నంబర్ 81 పరిధిలో నెహ్రూ నగర్ లేబర్ జంక్షన్ వద్ద ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నినా దాలు చేశారు.ఈ సందర్భంగా సీపీఎం మల్కా పురం జోన్ నాయకుడు బూడి శ్రీను మాట్లాడు తూ, భారత పౌరుల ఓటు హక్కును తొలగించే అధికారం ఎవరికీ లేదని అన్నారు. ఓటర్ల జాబి తా నుంచి పేర్లను తొలగించే విషయంలో నిబం ధనలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. రాజకీయ కక్షతో ఓటు హక్కును హరించడం ప్ర జాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విమర్శిం చారు.దేశవ్యాప్తంగా ఓటర్ల హక్కులపై ప్రశ్నలు తలెత్తుతున్నప్పటికీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ బాధ్యత వహించకుండా వ్యవహరించడం సరి కాదని బూడి శ్రీను అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎ స్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజల ఓటు హక్కుకు అన్యాయం చేయడం దుర్మార్గమని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజ లు బీజేపీ ప్రభుత్వానికి, సంబంధిత అధికారుల కు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించా రు.

ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. జె. రాము నాయుడు, జి. రామకృష్ణ, సీహెచ్. పైడి నాయుడు, ఎస్. దుర్గారావు, బి. కుమార్, ఆర్. శంకర్రావు, ఎం. శ్రీను, పవన్, సతీష్, సుభాన్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కాఫీ తోటలో ప్రమాదం.. గాయపడిన కార్మికుడికి టీడీపీ నేతల పరామర్శ



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 10:** మండలంలోని చాపరాతిపాలెంలో కాఫీ తోట పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడి తలకు తీవ్ర గాయాలైన రాట రవికుమార్‌ను సంకాడ టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు దేశగిరి గోవిందరావు పరామర్శించారు. శనివారం బాధితుడి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అందుతున్న వైద్య సేవల వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని, బాధితుడికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మామిడి చంటి, సంజీవరావు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో అఖిల భారత రైల్వే బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ ముగింపు



- ఆరు స్వర్ణాలతో నార్తర్న్ రైల్వేకు టైటిల్
- దక్షిణ తీర రైల్వేకు చెందిన జి. నిహారికకు ప్రత్యేక పురస్కారం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 10:** విశాఖపట్నంలోని రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్ (=×ాజు)లో నాలుగు రోజుల పాటు జరిగిన 80వ పురుషుల, 19వ మహిళల అఖిల భారత రైల్వే బాక్సింగ్ ఛాంపియన్‌షిప్--2026 శనివారం ఘనంగా ముగిసింది. ఈ పోటీల్లో ఆరు స్వర్ణ పతకాలతో నార్తర్న్ రైల్వే ఓవరాల్ టీమ్ ఛాంపి యన్‌గా నిలవగా, ఐదు స్వర్ణ పతకాలతో ఈస్ట ర్న్ రైల్వే రన్నరప్‌గా నిలిచింది. దక్షిణ తీర రైల్వే కు చెందిన జి. నిహారిక ఉత్తమ వర్ధమాన మహి ళా బాక్సర్ అవార్డును అందుకుంది.దక్షిణ తీర రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 7 నుంచి 10 వరకు నిర్వహించిన ఈ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 16 రైల్వే జోన్లకు చెందిన 142 మంది బాక్సర్లు పాల్గొన్నా రు. వీరిలో 86 మంది పురుషులు, 56 మంది మహిళలు ఉన్నారు. కొత్త రైల్వే జోన్ ఏర్పాటైన తర్వాత దక్షిణ తీర రైల్వే నిర్వహించిన తొలి ప్రధాన జాతీయ స్థాయి క్రీడా ఈవెంట్‌గా ఈ పోటీలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

ముగింపు కార్యక్రమానికి దక్షిణ తీర రైల్వే జన రల్ మేనేజర్ సందీప్ మాథుర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఎల్.వి. వి.ఎస్. పాత్రుడు, ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇం జినీర్ టి.కె. సిన్హా అతిథులుగా పాల్గొన్నా రు.ఈ సందర్భంగా సందీప్ మాథుర్ మాట్లాడు తూ, ఛాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వ హించిన నిర్వాహకులను, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. దేశంలో క్రీడల అభివృద్ధికి భారతీయ రైల్వేలు అందిస్తున్న సేవలను ప్రస్తావించారు. 1945లో ప్రారంభమైన పురుషుల అఖిల భారత రైల్వే బాక్సింగ్ ఛాంపి యన్‌షిప్ 80వ ఎడిషన్‌కు, 2007లో ప్రారంభ మైన మహిళల ఛాంపియన్‌షిప్ 19వ ఎడిషన్ కు చేరుకోవడం విశేషమన్నారు.ఇలాంటి పోటీ లు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం తోపాటు, వారి నైపుణ్యాలను మెరుగుపరచడా నికి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడానికి దోహదపడతాయని పేర్కొ న్నారు. నాలుగు రోజుల పాటు బాక్సర్లు ప్రదర్శిం చిన క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం, పట్టుదల, క్రీడాస్ఫూర్తిని ఆయన ప్రశంసించారు. ఇటీవల ప్రపంచకప్‌లో పాల్గొన్న నమన్ తన్వర్, నిఖిల్ దూబే, అన్మోల్‌లను అభినందించారు. నమన్ తన్వర్, నిఖిల్ దూబే కామన్వెల్త్ క్రీడల్లోనూ భా రత్‌కు ప్రాతినిధ్యం వహించారని గుర్తుచేశారు.ఛాంపియన్‌షిప్ నిర్వహణలో సహకరించిన రాజశీ=ూా బృందం, బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, రిఫరీలు, న్యాయనిర్ణేత లు, కోచ్‌లు, సాంకేతిక సిబ్బంది, స్వచ్ఛంద సేవకుల సేవలను జనరల్ మేనేజర్ అభినందిం చారు. భవిష్యత్తులో జరిగే జాతీయ, అంతర్జాతీ య పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు ఆకాంక్షించారు.డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా మాట్లాడుతూ, క్రీడాకారు లకు ఉద్యోగావకాశాలు, శిక్షణ సదుపాయాలు, సంస్థాగత సహకారం అందించడం ద్వారా క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంలో భారతీయ రైల్వే లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. క్రీడాకారుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, మెరుగైన శిక్షణ, క్రీడా మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ క్రీడా రంగంలో దక్షిణ తీర రైల్వే తనదైన గుర్తిం పును సాధించేందుకు ఈ ఛాంపియన్‌షిప్ మం చి వేదికగా నిలిచిందని పేర్కొన్నారు.అనంతరం సందీప్ మాథుర్, లలిత్ బోహ్రా విజేతలు, రన్నరప్‌లకు ట్రోఫీలు, పతకాలు, ధ్రువపత్రాల ను అందజేశారు. రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు కార్యవర్గ సభ్యులు, ఈవెంట్ నిర్వాహకులు, బాక్సింగ్ సంఘం ప్రతినిధులకు స్మారక చిహ్నాల ను ప్రదానం చేశారు.

**తుది ఫలితాలు**

ఓవరాల్ టీమ్ ఛాంపియన్: నార్తర్న్ రైల్వే -- 6 స్వర్ణ పతకాలు,ఓవరాల్ టీమ్ రన్నరప్: ఈస్టర్న్ రైల్వే -- 5 స్వర్ణ పతకాలు,ఉత్తమ పురుష బాక్సర్: కె. సంజీత్ సింగ్ -- ఈస్టర్న్ రైల్వే,ఉత్తమ వర్ధమాన పురుష బాక్సర్: ఆశిష్ -- నార్తర్న్ రైల్వే,ఉత్తమ మహిళా బాక్సర్: నకిత కుమారి -- నార్త్ ఫ్రంటియర్ రైల్వే,ఉత్తమ వర్ధమాన మహిళా బాక్సర్: జి. నిహారిక -- దక్షిణ తీర రైల్వే ఛాంపియన్‌షిప్ విజయవంతంగా ముగియడం తో నిర్వాహకులు, క్రీడాకారులు, అధికారులు, సహకరించిన సిబ్బందిని దక్షిణ తీర రైల్వే అభి నందించింది. ఈ పోటీలు కొత్త రైల్వే జోన్‌కు జాతీయ స్థాయిలో క్రీడా రంగంలో గుర్తింపు తెచ్చే దిశగా కీలక ముందడుగుగా నిలిచాయి.

## గిరిజన పాఠశాలల భవనాల నిర్మాణంలో నాణ్యత ఏదీ?



- గడువు తీరకుండానే కూల్చివేతలు..?
- ప్రజాధనం వృథాపై వైసీపీ నేతల ఆగ్రహం

**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 10:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన పాఠశాలల భవనాల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని వైఎస్సార్‌సీపీ నేతలు బొబ్బిలి లక్ష్మణ్, కుందేరి రామకృష్ణ ఆరోపించారు. నిర్మించి కొన్నేళ్లు గడవకముందే భవనాలు శిథిలావస్థకు చేరడం, కొన్ని చోట్ల కూల్చివేతలు చేపట్టడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాధారణంగా భవనాలకు నిర్ణీత కాలపరిమితి ఉన్నప్పటికీ, నాలుగైదేళ్లకే పాఠశాల భవనాలు దెబ్బతినడం నిర్మాణ నాణ్యతపై అనుమానాలు కలిగిస్తోందన్నారు. ఐదేళ్లు కూడా పూర్తికాకముందే పైకప్పుల నుంచి వర్షపు నీరు కారడం, పెచ్చులు ఊడి పడటం వంటి ఘటనలు విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. నిర్మాణాల సమయంలో నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించని అధికారులు, కాంట్రాక్టర్ల బాధ్యతను నిర్ధారించాలని డిమాండ్ చేశారు.ఏజెన్సీలో అనేక పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో నిర్మించిన భవనాలు కూడా నాణ్యత లోపాలతో నిరుపయోగంగా మారడం ఆందోళనకరమన్నారు. ప్రతి పాఠశాల భవనం నిర్మాణానికి అయిన వ్యయం, నిర్మాణ సంవత్సరం, భవనం ప్రస్తుత స్థితి వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని కోరారు.ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో సంబంధిత శాఖల అధికారులు నిర్మాణ పనుల నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కమిటీ చైర్మన్లు కూడా భవన నిర్మాణాల్లో నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గిరిజన విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## కూటమి గెలుపుకై నేతలకు దిశ నిర్దేశం

- అరకు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర.
- రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రవణ్ కుమార్.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 10.** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సియ్యారి దొన్ను దొర, ఆంధ్రప్రదేశ్ జీసీసీ చైర్మన్ కిడారి శ్రవణ్ కుమార్ కూటమి నేతలకు పిలుపునిచ్చారు. అరకు నియోజకవర్గం, ముంచంగిపుట్టు మండలం, బూసిపుట్టు పంచాయతీ పరిధిలో కూటమి నాయకులతో కార్యకర్తలతో శనివారం విస్తృత స్థాయి సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ స్థానిక ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే ధ్యేయంగా ముందుకు సాగాలని కూటమి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి ఓటరునూ కలిసి కూటమి విజయానికి మద్దతు కూడగట్టాలని, ప్రతి గ్రామంలోనూ బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేయాలన్నారు. ఓటర్లతో నిరంతరం సత్సంబంధాలు కలిగి ఉండాలని, స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు విభేదాలు పక్కనబెట్టి సమిష్టిగా శ్రమించాలన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజలకు వివరించాలని కూటమి శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ పాంగి కామేష్, పిఎసిఎస్ చైర్మన్లు సామల బాబుజి, ప్రసాద్, టీడీపీ మండల కార్యదర్శి కె జాగత్రాయ్, మాజీ సర్పంచ్ టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండురంగస్వామి, మాజీ సర్పంచులు వి లక్ష్మణ్, ముత్యాలమ్మ, క్లస్టర్ ఇంచార్జ్ బిరామారావు, యూనిట్ ఇంచార్జ్ లైకోన్, బలరాం, కూటమి నాయకులు సింహాచలం, తిరుపతిరావు, ప్రసాద్, సురేష్, గాసిరం, అచ్చిబాబు, కూటమి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జనసేన అరకు పార్లమెంటు నిర్వాహక దళ సభ్యుడిగా నీటిపల్లి శ్రీను ఎన్నిక.



**చింతపల్లిపెన్ పవర్ అక్టోబర్ 10.** జనసేన పార్టీ అరకు పార్లమెంటు నిర్వాహక దళ సభ్యుల ఎంపిక కార్యక్రమం అరుకులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లికి చెందిన నీటిపల్లి శ్రీను నిర్వాహక దళ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సమన్వయకర్తలు శ్రీ కొణిదెల నాగబాబు, శ్రీ నెమ్మక జయకృష్ణ, శ్రీ వంపూరి గంగులయ్య ఆధ్వర్యంలో ఈ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అరకు పార్లమెంటు పరిధిలో పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడం, పార్టీ అభివృద్ధికి కృషి చేయడం లక్ష్యంగా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు.చింతపల్లికి చెందిన నీటిపల్లి శ్రీనుకు ఈ బాధ్యత దక్కడంపై జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## త్రిశూల్‌లో ఆటో డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన

వాహనాలకు ఇన్సూరెన్స్, అవసరమైన పత్రాలు తప్పనిసరి: ఎస్సై కే. సురేష్



**గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 10:** ఆపరేషన్ త్రిశూల్‌లో భాగంగా రహదారి భద్రతపై గూడెంకొత్తవీధి మండల ఆటో యూనియన్ సభ్యులు, డ్రైవర్లకు ఎస్సై కే. సురేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆటోలకు ప్రత్యేక స్టిక్కర్లు అందజేశారు.ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా వాహన ఇన్సూరెన్స్‌తో పాటు అవసరమైన పత్రాలను కలిగి ఉండాలని ఎస్సై సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జీవిత బీమా ప్రాధాన్యతపై కూడా అవగాహన కల్పించారు.అలాగే గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. రహదారి భద్రతను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆటో డ్రైవర్లకు ఎస్సై కే. సురేష్ పిలుపునిచ్చారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

- లబ్బూరు, కిలగడ పీహెచ్సీలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు.
- లబ్బూరు పిహెచ్సి వైద్యాధికారి శ్యామ్ ప్రసాద్, ఆప్తమాలిక్ కిషోర్.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 10.** మండలంలో గల లబ్బూరు, కిలగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి శ్యాంప్రసాద్, ఆప్తమాలిక్ కిషోర్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాలలో కంటి సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా సేవలు అందించారు. వైద్య శిబిరాలలో 108 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 28 మందికి శస్త్ర చికిత్సచేయాలని గుర్తించమని కిషోర్ అన్నారు. అల్లూరి జిల్లా అందత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య పరీక్షల్లో 28 మందికి శస్త్ర చికిత్సలు నిమిత్తం శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించామని, కంటి శస్త్ర చికిత్సలు పుణ్యగిరి ఆసుపత్రిలో ఉచితంగానే చేస్తారని, వాహన, భోజన సదుపాయం ఉచితంగా కల్పిస్తున్నట్లు కిషోర్ పేర్కొన్నారు. శస్త్ర చికిత్స అనంతరం వారిని స్వగ్రామాలలో చేర్పిస్తామన్నారు.

## పైనాపిల్ కాలనీలో నీటి కష్టాలకు చెక్ - 416 కుటుంబాలకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే వెలగపూడి చొరవతో కొత్త బోరుకు శంకుస్థాపన



**విశాఖ తూర్పు,పెన్ పవర్ అక్టోబర్ 10:** జీవీఎంసీ16వ వార్డు పైనాపిల్ కాలనీ జేఎన్ఎన్యూఆర్ఎం బ్లాక్స్‌లో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడికి ఎట్టకేలకు పరిష్కారం లభించింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాలతో కొత్త బోరువెల్ పనులకు శ్రీకారం చుట్టారు. కొంతకాలంగా ఈ కాలనీలో నీటి సమస్యతో 416 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు16వ వార్డు అధ్యక్షులు దృష్టికి తీసుకురాగా,ఆయన వెంటనే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందిని గుర్తించిన ఎమ్మెల్యే తక్షణమే స్పందించి నూతన బోరు మంజూరు చేయించారు. శుక్రవారం వార్డు నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసుల సమక్షంలో కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు.

**416 కుటుంబాలకు ఊరట**

ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు మాట్లాడుతూ 13 బ్లాకుల్లో ఒక్కో బ్లాక్‌లో 32 కుటుంబాల చొప్పున మొత్తం 416 కుటుంబాలు నివసిస్తున్నాయని, వారందరికీ శాశ్వతంగా నీటి ఎద్దడి లేకుండా 6.5 అంగుళాల భారీ బోరు వేయిస్తున్నామని తెలిపారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కు కాలనీవాసుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి పాత్రకండ ధర్మారావు, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులు మారిక జక్కన్న, కిల్లంశెట్టి శ్రీనివాసరావు,సురేష్, రాంబాబు వర్మ,ప్రసాద్, కనకరాజు, నగేష్,శ్రీనివాస్, రమణమూర్తి, ప్రసాద్, శ్యాంసుందర్,మంగరాజు గణపతిరావు, కనకల శ్రీను,పైడిరాజు,రాజు,వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్షన్ కమిషనర్ రాజీనామాకు డిమాండ్

- ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం.
- ఆదివాసి గిరిజన సంఘం నాయకులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 10.** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘంతో పాటు ఐద్వా, సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా నాలుగు రోడ్ల కూడలిలో భారీ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం ఎం శ్రీను మాట్లాడుతూ.. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ శాంతియుత ర్యాలీకి వెళ్తున్నా సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేయడాని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఉద్యమాలను అణచివేసేందుకు కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజా ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతోందని విమర్శించారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న వారిని అణచివేయడం, భారత పౌరుల ఓటు హక్కులను తొలగించడం హేయమైన చర్య అని అన్నారు. తొలగించిన సుమారు 13 కోట్ల మంది ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజల గొంతుకను నొక్కేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం ఈ వైఖరిపై పునరాలోచించి, అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు జయ, విజయ, రాధ, సీఐటీయూ మండల కార్యదర్శి కె శంకర్రావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు జి నారాయణ, జి జీనబంద్, సీతారామ్, ఆర్ దేవన్న కె దోంబురు తదితరులు పాల్గొన్నారు.

# దసరా ప్రయాణికుల కోసం 450 ప్రత్యేక బస్సులు




**రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 10 :** దసరా పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖప ట్నం జిల్లా పరిధిలో సుమారు 450 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నం ప్రాంతీయ మేనేజర్ బి. అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివా రం ద్వారకా బస్‌స్టేషన్‌లో ప్రత్యేక బస్సుల నిర్వ హణ, ప్రయాణికుల రద్దీ, సిబ్బంది విధుల నిర్వ హణను పరిశీలించారు. అక్టోబర్ 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రభుత్వం విద్యాసంస్థ లకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో విద్యా ర్థులు, తల్లిదండ్రులు స్వస్థలాలకు, వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు ప్రారంభించారని ఆయన పేర్కొన్నారు. ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణాలను ప్రణాళిక చేసుకుని, ఏపీఎస్ఆ ర్టీసీ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొ ని బస్సు టికెట్లను రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బస్సుల వివరాలు, వాటి ప్రస్తుత స్థానం తెలుసుకోవచ్చని, తద్వారా ప్రయాణం మరింత సౌకర్యవంతంగా ఉంటుం దని తెలిపారు,దసరా రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు ద్వారకా బస్‌స్టేషన్‌లో 24 గంటల పాటు అధికారులు, సూపర్‌వైజర్లు, భద్రతా సిబ్బంది పర్యవేక్షించేలా చర్యలు తీసు కున్నామని వెల్లడించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వ తీపురం, సాలూరు, పాలకొండ, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు బస్సుల సం ఖ్యను పెంచడం లేదా తగ్గించడం జరుగుతుంద ని వివరించారు. శనివారం సుమారు 25 ప్రత్యేక బస్సులను నడిపేందుకు చర్యలు చేపట్టామని, ఆదివారం, సోమవారం ప్రయాణికుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున అవస రాన్ని బట్టి అదనపు బస్సులను అందుబాటు లోకి తీసుకువస్తామని ప్రాంతీయ మేనేజర్ తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ గంగాధర్, ట్రాఫిక్ మేనేజర్ రమణ, శ్రీనివాసరావుతో పాటు పలువురు అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నాతవరం క్రీడాకారులు.....

- క్రీడాకారులకు దాతల చేయూత..
- ఆర్థిక సహాయంతో పాటు క్రీడా దుస్తుల అందజేత....
- ప్రతిభను ప్రోత్సహించడంలో దాతృత్వం..
- గ్రామీణ క్రీడాకారులకు వెన్నుదన్నుగా నిలిచిన దాతలు....



**నాతవరం,పెన్ పవర్ (అక్టోబర్ 10):** గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి, రాష్ట్రస్థాయిలో సత్తా చాటేలా యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని క్రీడాభిమానులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు నాతవరం మండలం నుంచి ఐదుగురు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించేందుకు సిద్ధమయ్యారు. వీరికి అవసరమైన ప్రయాణ ఖర్చులు, పోటీల ప్రవేశ రుసుము, క్రీడా దుస్తుల కోసం పలువురు దాతలు ఆర్థిక సహాయంతో పాటు తమ వంతు సహకారం అందించి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు నాతవరం నుంచి ఐదుగురు క్రీడాకారులు బయలుదేరనున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు నాతవరం క్రీడాకారులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పోటీలకు వెళ్లే క్రీడాకారులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా దాతలు ముందుకు వచ్చి ప్రోత్సాహాన్ని అందించారు. పోటీల్లో పాల్గొనే ఐదుగురు క్రీడాకారుల ప్రయాణ ఖర్చుల నిమిత్తం పి.జగ్గంపేటకు చెందిన చింతకాయల గోవింద్ రూ. 5,000 ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా పోటీల ఎంట్రీ ఫీజు చెల్లించేందుకు సీఈఓ వెలగా వెంకటకృష్ణారావు రూ. 5,000 స్పాన్సర్ చేశారు. దీంతో క్రీడాకారులకు ప్రయాణం, ప్రవేశ రుసుము వంటి ఖర్చుల విషయంలో గణనీయమైన ఊరట లభించింది. క్రీడలపై ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించేందుకు దాతలు చూపిన చొరవ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. ఆర్థిక సహాయంతో పాటు క్రీడాకారులకు అవసరమైన దుస్తులను సమకూర్చడంలోనూ దాతలు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. బాలికల జట్టులోని 18 మంది క్రీడాకారిణులకు శెట్టి లోవ (ఎస్ఎస్ఎస్) టీ-షర్టులను అందజేశారు. అలాగే బాలుర జట్టులోని 18 మంది క్రీడాకారులకు నర్సీపట్నం హెడ్‌మాస్టర్ కె. సతీష్ టీ-షర్టులను అందించారు. పోటీల్లో జట్టు సభ్యులంతా ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో పాల్గొనేందుకు ఈ సహకారం దోహదపడనుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పలువురు క్రీడాకారులు ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాలను కోల్పోతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో దాతలు, విద్యావేత్తలు ముందుకొచ్చి ఆర్థిక సహాయం, క్రీడా సామగ్రి, దుస్తులు అందించడం క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుంది. నాతవరం క్రీడాకారులకు అందిన సహకారం కూడా గ్రామీణ క్రీడా ప్రతిభను ప్రోత్సహించే మంచి ప్రయత్నంగా నిలుస్తోంది. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లనున్న క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందించిన చింతకాయల గోవింద్, ఎంట్రీ ఫీజును స్పాన్సర్ చేసిన వెలగా వెంకటకృష్ణారావు, క్రీడా దుస్తులు అందించిన శెట్టి లోవ (ఎస్ఎస్ఎస్), హెడ్‌మాస్టర్ కె. సతీష్‌లకు క్రీడాభిమానులు కృతజ్ఞతలు తెలిపారు. దాతల ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకుని క్రీడాకారులు పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి వేదికపై తమ ప్రతిభను చాటుకుని మంచి ఫలితాలు సాధించడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని నాతవరం ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

## చోరికి గురైన ద్విచక్ర వాహనం




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 10.** మండలంలో గల బుంగాపుట్టు పంచాయతీ, బొర్ర మామిడి గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. గ్రామానికి చెందిన కొర్ర గోపాల్ ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉండగా గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బండీని అపహరించినట్లు స్థానికులు తెలిపారు. అపహరణకు గురైనా బండి విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని, ఏపీ 39 ఎస్ఎఫ్ 9840 నంబరు గల ద్విచక్ర వాహనం ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 7032486399 ఫోన్ నెంబర్ కు తెలియజేయాలని స్థానికులు కోరారు.

## జనసేన ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీలో చింతూరు నేతలకు చోటు







**బేడే సతీష్, తీగల రవి, తీగల కవిత, పయ్యాల నాగేశ్వరరావుకు బాధ్యతలు**

**చింతూరు, పెన్ పవర్ అక్టోబర్ 10:** రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జనసేన పార్టీ ఏర్పాటు చేసిన ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీలో చింతూరు మండలానికి చెందిన నలుగురు నాయకులకు చోటు లభించింది. బేడే సతీష్, తీగల రవి, తీగల కవిత, పయ్యాల నాగేశ్వరరావులను కమిటీ సభ్యులుగా నియమించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అవసరమైన కార్యాచరణ రూపొందించడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం సాధించడం, అభ్యర్థుల ఎంపికలో సహకరించడం, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం వంటి అంశాల్లో ఈ కమిటీ కీలకంగా వ్యవహరించనుంది. చింతూరు మండలానికి చెందిన నలుగురు నాయకులకు ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీలో అవకాశం కల్పించడంపై మండలంలోని జనసైనికులు, పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నలుగురు నాయకులకు అభినందనలు తెలియజేస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి జనసేన పార్టీ విజయానికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

# పైడిపుట్టలో ఘనంగా గంగాలమ్మ తల్లి సన్నిధిలో చండీ హోమం...





**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్10;** అల్లూరి శ్రీరామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం మహాలయ అమావాస్య పురస్కరించుకుని, అల్లూరి శ్రీరామరాజు రచ్చబండ ప్రాంగణంలో హైదరాబాద్, అమలాపురం, రాజమండ్రి ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి అమ్మవారి హోమాధి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లూరి శ్రీ రామరాజు మనుమడు అల్లూరి శ్రీరామరాజు, పైడి పుట్ట, అడ్డతీగల, చుట్టుప్రక్కల గ్రామస్థులు గంగాలమ్మ తల్లి అమ్మవారి సన్నిధిలో అమావాస్య సందర్భంగా చండీ హోమం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అల్లూరి శ్రీరామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రజల శ్రేయస్సు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని బ్రహ్మశ్రీ అయ్యప్ప బ్రహ్మ ఆశీర్వచనాలను భక్తులకు అందజేశారు. ప్రతి నెల అమావాస్య రోజున అమ్మవారికి జరిగే ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనడం ఆనవాయితీగా మారింది. ఈ కార్యక్రమంలో

అల్లూరి శ్రీరామరాజు యువజన సంఘం కమిటీ సభ్యులు, పైడిపుట్ట గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి సన్నిధిలో వేదమంత్రోచ్చారణల మధ్య చండీ హోమం నిర్వహించడంతో అల్లూరి రచ్చబండ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందారు.చండీ హోమం కార్యక్రమం విజయవంతంగా ముగిసిన అనంతరం అల్లూరి శ్రీరామరాజు యువజన సంఘం కమిటీ ఆధ్వర్యంలో పాల్గొన్న భక్తులు, గ్రామస్థులకు ప్రసాద వితరణ చేపట్టారు. హాజరైన వారందరికీ భోజన ఏర్పాట్లు చేసి అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక సంప్రదాయాలను కొనసాగిస్తూ, ప్రజలందరినీ ఐక్యంగా ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. అల్లూరి శ్రీరామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ చండీ హోమం కార్యక్రమం భక్తిభావంతో, గ్రామస్థుల భాగస్వామ్యంతో ప్రశాంతంగా ముగిసింది.

# మాజీ ఎంపీ హర్షకుమార్ గృహ నిర్బంధం

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఛలో రాజ్‌భవన్‌కు పిలుపు**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,అక్టోబర్ 10:**విజయవాడలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఛలో రాజ్‌భవన్ ముట్టడి పిలుపు సంబంధించి మాజీ ఎంపీ హర్షకుమార్‌ను పోలీసులు శనివారం గృహనిర్బంధం చేశారు. తన నివాసంలో ఉన్న తనకు పోలీసులు గృహనిర్బంధం నోటీసులు అందజేయడంపై హర్షకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో నిరసన కార్యక్రమానికి పిలుపునిస్తే, సుమారు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమండ్రిలో తనను నిర్బంధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇల్లు విడిచి బయటకు రావద్దని నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం. ఈ చర్యపై హర్షకుమార్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, తన నివాసం వద్ద పోలీసులు ఆంక్షలు విధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విజయవాడలో కాంగ్రెస్ పార్టీ ఛలో రాజ్‌భవన్ ముట్టడి కి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. విజయవాడలో జరిగే కార్యక్రమానికి తనను హౌస్ అరెస్ట్ చేయడం వెనుక కారణమేంటని హర్షకుమార్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనే స్వేచ్ఛపై హర్షకుమార్ లేవనెత్తిన ప్రశ్నలు లేవనెత్తారు. ముందస్తు నిర్బంధ చర్యల పేరుతో పోలీసులు తీసుకుంటున్న నిర్ణయాలపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ హర్షకుమార్‌కు గృహనిర్బంధం చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది

# ఊపిరితిత్తుల మార్పిడి, ఎక్మో సేవల్లో అత్యాధునిక వైద్యం




యశోద హాస్పిటల్స్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ

**రాజమహేంద్రవరం , పెన్ పవర్ అక్టోబర్ 10:** సంక్లిష్టమైన శ్వాసకోశ వ్యాధులతో ప్రాణాపాయ స్థితిలో రోగులకు అత్యాధునిక సాంకేతిక వైద్య సేవలను యశోద హాస్పిటల్ నిలుస్తోంది. ఊపిరితిత్తుల మార్పిడి, ఎక్మో, క్రిటికల్ కేర్ విభాగాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అందుబాటు లోకి తెచ్చింది. ఈ విభాగంలో కన్సల్టెంట్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ తపస్వి కృష్ణ కాట్రగడ్డ సేవలంది స్తున్నారు. శనివారం స్థానికంగా జరిగిన మీడియా సమావేశంలో ఊపిరితిత్తుల వ్యాధుల నిర్ధారణ, శస్త్రచికిత్సకు ముందు, తర్వాత రోగుల సంరక్షణలో డాక్టర్ తపస్వి కృష్ణ కాట్రగడ్డ వందలాదిమంది క్యాన్సర్ రోగులను సంపూర్ణ ఆరోగ్యం కల్పించారు. అరుదైన కేసులను సైతం ఆధునిక శస్త్ర చికిత్సలు, మార్పిడీల ద్వారా విజయవంతంగా రోగులకు నాణ్యమైన జీవితాన్ని అందిస్తున్నామని డాక్టర్ తపస్వి కృష్ణ కట్రగడ్డ తెలిపారు. యశోద హాస్పిటల్స్ చీఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ వినీత్ ఐలాపురం పర్యవేక్షణలో హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. వైద్య సేవల నిర్వహణ, రోగుల భద్రత, విభాగాల వైద్యుల మధ్య సమన్వయం సాధిస్తున్నామని డాక్టర్ వినీత్ ఐలాపురం తెలిపారు. సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ దక్షిణాది రాష్ట్రాల్లో శ్వాసకోశ వైద్య సేవలకు ప్రధాన కేంద్రంగా ఆవిర్భవించిందన్నారు.ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ మేనేజర్ బాల వీరభద్ర నల్లం, తూర్పు గోదావరి జిల్లా అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ ఎండి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ వైద్య, ఆరోగ్య ఉద్యోగులను రెగ్యులరైజ్ కోరుతూ ధర్నా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,అక్టోబర్ 10:**కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బందిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ప్రజారోగ్య వేదిక జిల్లా కన్వీనర్ బి.వి.ఎన్. పూర్ణిమారాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద పారామెడికల్ సిబ్బంది నిర్వహిస్తున్న ఆందోళన శిబిరాన్ని సందర్శించి, వారి నిరసనకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా పూర్ణిమారాజు మాట్లాడుతూ, ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆరోగ్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. దీర్ఘకాలంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారికి న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్ పూర్తయ్యే వరకు సిబ్బందికి గ్రాస్ శాలరీ చెల్లించాలని, విధి నిర్వహణలో ఉండగా మరణించిన సిబ్బంది కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం అందించాలని కోరారు. ఆరోగ్య సిబ్బందికి తగిన భద్రత, ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.కాంట్రాక్ట్ ఆరోగ్య సిబ్బంది తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పూర్ణిమారాజు పిలుపునిచ్చారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజారోగ్య వేదిక మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కాంట్రాక్ట్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

# కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కంటి శుభ్రత చాలా ముఖ్యం లయన్ కొత్త సుభద్ర.






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 10.**కళ్లను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి మరియు ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా ఉండటానికి ప్రతిరోజూ పాటించాల్సిన ముఖ్యమైన నియమాలు ఉన్నాయి.

చేతుల శుభ్రత చేతులను కడుక్కోవడం: కళ్లను తాకడానికి లేదా నలపడానికి ముందే ఎల్లప్పుడూ మీ చేతులను సబ్బు మరియు నీటితో శుభ్రంగా కడుక్కోవాలని వనిత లయన్స్ క్లబ్ వైస్ ప్రసిడెంట్ లయన్ కొత్త సుభద్ర అన్నారు రీజయన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణం రాజు సౌజన్యంతో కడియద్ద జిల్లా పరిషత్ హైస్కులు లో వనిత లయన్స్ క్లబ్ తరుపున కంటి శుభ్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి మాట్లాడుతూ

కళ్లను నలపకండి: కళ్లలోకి దుమ్ము వెళ్లినప్పుడు చేతులతో గట్టిగా నలపకూడదుని దీనివల్ల కంటిపై గీతలు పడటం లేదా ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు కు వివరించారు. లయన్ లక్ష్మి లలిత మాట్లాడుతూ ముఖం మరియు కళ్ల ప్రక్షాళన

చల్లని నీటితో: రోజుకు కనీసం రెండు లేదా మూడు సార్లు స్వచ్ఛమైన, చల్లని నీటితో కళ్లను మెల్లగాకడుక్కోవాలన్నారు లయన్స్ జిల్లా 316జి గవర్నర్ లయన్ డాక్టర్ దశక సుబ్బారావు పిలుపు మేరకు డైమండ్స్ లయన్స్ వనిత లయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో కంటి సంరక్షణ శిబిరాలు 3రోజుకు చేరుకున్నాయి అని రీజయన్ చైర్ పర్సన్ లయన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణం రాజు సహకారం తో రూరల్ ప్రాంతాల్లో కూడా డిజిటల్ కంటి పరిరక్షణ జాగ్రత్త లు విద్యార్థులు కు అవగాహనా కార్యక్రమం లు చేపట్టామ్ అన్నారు ఈ కార్యక్రమం లో లయన్స్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన జగ్గంపేట నియోజకవర్గ సమన్వయకర్తగా రాజ్యలక్ష్మి.





**నిర్వాహక దళ్ సభ్యుడిగా గోళ్ళ విజయ్.**

**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 10:-** జనసేన పార్టీ సంస్థాగత నియామకలపై దృష్టి సారించింది దీనిలో భాగంగా జగ్గంపేట నియోజకవర్గానికి ముగ్గురిని సమన్వయకర్తలు గా నియమించగా అందులో ఒక సమన్వయకర్తగా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చల్లా రాజ్యలక్ష్మి నియమించారు. నిర్వాహక దళ్ సభ్యుడిగా గోల విజయ్ ని నియమించినట్లు ఈరోజు అధికారం గా ప్రకటన విడుదల అయినట్లు గోళ్ళ విజయ్ తెలిపారు. గోళ్ళ విజయ్ గోకవరం మండలంలోని మల్లవరన గ్రామానికి చెందిన వ్యక్తిగా జనసేన పార్టీ అంటే మొదటి నుంచి ఎంతో మక్కువగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేయడం మాత్రమే కాకుండా ఒక ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకుడిగాను తాను పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేయడంతో అధిష్టానం గుర్తించి నియమించినట్లు విజయ్ తెలిపారు. నాపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయభాస్కర్ కి జగ్గంపేట నియోజకవర్గం ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ కి మండల పార్టీ పెద్దలు పదిలం మురళి మరియు ప్రతి జనసేన నాయకులకు వీర మహిళలకు రుణపడి పార్టీ అభివృద్ధికి పనిచేస్తానని గోళ్ళ విజయ్ అన్నారు.

# అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి వడ్డీ రఘురామ్ నాయుడు పరామర్శ-అండగా ఉంటామని భరోసా



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. అక్టోబర్ 10.**తాడేపల్లిగూడెం రూరల్ మండలం కొండుప్రోలు గ్రామానికి చెందిన కొండేపూరీ సుశీల గారి ఇల్లు అగ్నిప్రమాదం గురైందని ఇల్లు కాలిపోవడంతో బాధిత కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లిన బాధిత కుటుంబానికి రూ.10,000/- (పది వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించారు తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని, కాలిపోయిన ఇంటిని పరిశీలించారు ప్రమాదం జరిగిన తీరును బాధిత కుటుంబానికి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అగ్నిప్రమాదం కారణంగా ఇల్లు దెబ్బతినడం, ఇంట్లోని వస్తువులు కాలిపోవడం వల్ల కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఇలాంటి కష్ట సమయంలో బాధిత కుటుంబం ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు ప్రమాదాలు సంభవించినప్పుడు బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆపద సమయంలో బాధితులకు ధైర్యం చెప్పడంతో పాటు, వారు తిరిగి సాధారణ జీవితం ప్రారంభించేలా సహకరించడం ఎంతో ముఖ్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **INDALA PENTAVENI,** W/o. **RAVI CHANDRA E KESIBOYAN**, residing at Door No.14-10/301, Flat No.301, Manikanta Srinivasam, Sec-2, T.I.C Point, Arilova, Visakhapatnam, have changed my name from **INDALA PENTAVENI** (Old Name) to **INDALA MADHURI VENI** (New Name). Henceforth, She shall be known and called as to **INDALA MADHURI VENI** for all purposes.

# రూ.7.37 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన





✷ అనాథ చిన్నారులకు ఆధార్, రేషన్ కార్డులు అందించాలని ఎమ్మెల్యే ఆదేశం

**పెన్ పవర్ ఉంగుటూరు, అక్టోబర్ 10:**పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు మండలంలో రూ.7 కోట్ల 37 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఉప్పాకపాడు, బొమ్మిడి, వీ.ఏ.పురం, దొంతవరం, సీతారాంపురం, కాగుపాడు, అప్పారావుపేట, నీలాద్రిపురం, నాచుగుంట, ఉంగుటూరు, యర్రమిల్లిపాడు, ఏ.గోకవరం, వీకే పురం, కైకరం తదితర గ్రామాల్లో వీబీజీ రామ్‌జీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**అనాథ చిన్నారులకు అండగా ఎమ్మెల్యే**

తల్లాపురంలో తల్లిదండ్రుల ఆదరణకు దూరమైన ఇద్దరు ఆడపిల్లల సమస్యపై ఎమ్మెల్యే ధర్మరాజు మానవత్వంతో స్పందించారు. తన కుమారుడు మరణించాడని, కోడలు పిల్లలను వదిలి వెళ్లిపోయిందని, దీంతో ఇద్దరు మనవరాళ్లను తానే పోషిస్తున్నానని వృద్ధురాలు ఆదాము ఎమ్మెల్యేకు తన ఆవేదనను తెలియజేసింది. ఆ చిన్నారులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు కూడా లేవని, ప్రభుత్వ పథకాల ద్వారా ఆదుకోవాలని కోరింది.వృద్ధురాలి పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే తహశీల్దారు మర్రపు సన్యాసిరావును పిలిచి మాట్లాడారు. ఇద్దరు చిన్నారులకు ఆధార్ కార్డులు ఇప్పించడంతో పాటు రేషన్ కార్డులు మంజూరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు.

## నైపుణ్యం పోర్టల్‌లో యువత నమోదు చేసుకోవాలి

నైపుణ్య శిక్షణ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి





**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 10:**పోలవరం జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రభుత్వం కల్పిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి పి. నిరుపమ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. పెరుమళ్ల రావు కోరారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో అర్హులైన అభ్యర్థులందరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నైపుణ్యం' పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ పోర్టల్‌లో విద్యార్హతలు, నైపుణ్యాల వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా అర్హతలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, ఉద్యోగ అవకాశాలు, జాబ్‌మేళాలు, ఉపాధి అవకాశాలు, కెరీర్ మార్గదర్శక కార్యక్రమాల సమాచారాన్ని పొందవచ్చని అధికారులు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులు, దూరవిద్య అభ్యసిస్తున్నవారు, చదువు పూర్తి చేసిన యువత, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.
పోర్టల్‌లో నమోదు సమయంలో సందేహాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే 9491585971, 6304634447, 6281618037 నంబర్లను సంప్రదించి సహాయం పొందవచ్చని అధికారులు వెల్లడించారు.

# అక్టోబర్ 14న జాబ్ మేళా



✷ జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 10:**తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో అక్టోబర్ 14వ తేదీ ఉదయం 9 గంటలకు అర్బన్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయం ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష శనివారం తెలిపారు.
పలు స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ జాబ్ మేళాలో సిగ్మా ఆటోమేషన్, భావఘ్న పవర్ సిస్టమ్స్, బొప్పన హాస్పిటల్, లుమెంటిక్స్ సొల్యూషన్స్, ఎస్సీ మోటో కార్ప్, నవత ట్రాన్స్‌పోర్ట్, ఫ్లిప్‌కార్ట్ హోల్‌సేల్, యూనిటీ టీవీఎస్, ఎలక్ట్రకేర్, జయలక్ష్మి మోటార్స్, కార్తికేయ కంఫర్ట్ ఏసీ, కేఎస్ ఏసీ తదితర సస్థలు పాల్గొనను న్నాయన్నారు. డిప్లొమా విద్యార్హత కలిగిన అభ్యర్థులు, సాంకేతిక నిపుణులకు పలు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంజినీరింగ్, వైద్య, నర్సింగ్ కోర్సులు లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, అనుభవం ఉన్నవారికి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సూచించారు. రిజిస్ట్రేషన్ అనంతరం తాజా రెజ్యూమే, ఆధార్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో అక్టోబర్ 14న ఉదయం 9 గంటలకు జాబ్ మేళాకు నేరుగా హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 8712655686, 8790115349, 8790117279 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.



ఎటపాక పెన్ పవర్ అక్టోబర్ 10 తోటపల్లి ఆదిత్య స్కూల్ ఘనంగా దసరా సంబరాలు

## మహాలయ అమావాస్య అన్నదానానికి విశేష ప్రాధాన్యం

ఆరేళ్లుగా గౌతమేశ్వర స్వామి ఆలయంలో అన్నసమారాధన





**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 10:**తాళ్ళపూడి గోదావరి గట్టువద్ద ఉన్న పురాతన గౌతమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత ఆరేళ్లుగా పితృప్రేమికుల సహకారంతో ఈ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కవల శ్రీనివాస్ తెలిపారు.మహాలయ అమావాస్యకు విశేషమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని, పితృదేవతల అనుగ్రహం పొందేందుకు ఈ రోజున చేసే దానధర్మాలు ఎంతో విశిష్టమైనవని పురాణ ఉపన్యాసకులు పరస రాధాకృష్ణ పేర్కొన్నారు. అన్నదానం, జలదానం ద్వారా కర్ణుడు అన్నదాన ఫలితాన్ని పొందినట్లు పురాణాలు వివరిస్తున్నాయని, మహాలయ అమావాస్య రోజున అన్నదానం చేయడం ఎంతో పుణ్యప్రదమని తెలిపారు. కవల శ్రీనివాస్ వంటి నిస్వార్థ సేవకులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన ప్రశంసించారు.
కవల శ్రీనివాస్ నిస్వార్థంగా పలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గణపతి యువజన సంఘం ప్రతినిధి డీవీవీ సత్యనారాయణ అన్నారు. మహాలయ అమావాస్య అన్నసమారాధన, కార్తీక మాసంలో గోదావరి రేవులో అఖండ దీపారాధన, వెన్నెల్లో సీతారామ కల్యాణం, మహాశివరాత్రి రోజున ఇరవై అడుగుల లింగోద్భవ జ్యోతి ఏర్పాటు, ఉసిరిచెట్టు కింద కార్తీక సమారాధన, గోసేవ వంటి అరుదైన కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇటువంటి సేవలను సమాజం గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కిల్లాని అప్పారావు, నందమూరి మణికంఠ, కిల్లాని లక్ష్మణరావు, దూడల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## గంగాలమ్మ జాతరలో ఘనంగా అన్నదానం

తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 10:ప్రక్కిలంకలో గంగాలమ్మ జాతర ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాతరకు విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.



## ఉంగుటూరు మండలంలో స్థానిక ఎన్నికల సందడి!

✷ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అధికారుల ముందస్తు కసరత్తు



**పెన్ పవర్ ఉంగుటూరు, అక్టోబర్ 10:**ఉంగుటూరు మండలంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన వివరాలను సిద్ధం చేసే పనిలో మండల పరిషత్ అధికారులు నిమగ్నమయ్యారు. రిజర్వేషన్ల ఖరారుకు అవసరమైన సమాచారాన్ని సేకరిస్తూ, ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాల వివరాలను నవీకరిస్తున్నారు.ఉంగుటూరు మండలంలో మొత్తం 64,065 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఎస్సీలు 14,616 మంది, ఎస్టీలు 770 మంది, బీసీలు 33,715 మంది, ఓసీలు 14,964 మంది ఉన్నారు. ఈ వివరాల ఆధారంగా ఎన్నికలకు అవసరమైన సమాచారాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు.శనివారం సెలవు రోజైనప్పటికీ ఈవోపీఆర్డీ రమేష్‌బాబు, కార్యాలయ పరిపాలనాధికారి ఆంజనేయబాబు ఆధ్వర్యంలో సిబ్బంది సమాచార నమోదు పనులను కొనసాగించారు. ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండేలా అధికారులు కార్యాచరణ చేపట్టారు. దీంతో మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సంబంధిత పనులు వేగంగా సాగుతున్నాయి.

## అన్నదేవరపేట సన్ లైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా దసరా సంబరాలు



**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 10:**అన్నదేవరపేటలోని సన్ లైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో పాఠశాల కరస్పాండెంట్ సిద్దు ఆధ్వర్యంలో దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. విజయదశమి పండుగ విశిష్టతను, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటామని పాఠశాల కరెస్పాండంట్ సిద్దు వివరించారు. సంప్రదాయాలు, సంస్కృతిని గౌరవిస్తూ పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో వేడుకలు సందడిగా సాగాయి.

# సీఈసీ రాజీనామా చేయాలి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 10** ; దేశంలో 13 కోట్ల ఓట్లను తొలగించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని మండల సిపిఐ కార్యదర్శి కారం ధారయ్య డిమాండ్ చేశారు. శనివారం జీలుగుమిల్లిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా కూటమి పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. 20 23 చట్టాన్ని రద్దుచేసి పౌర సమాజ భాగస్వామ్యంతో కొత్త చట్టాన్ని రూపొందించాలని అన్నారు .ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత జవాబు భారీతనం పెంచి అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని అన్నారు .సర్ ప్రక్రియను నిలిపివేసి వివాదాస్పద నిర్ణయాలపై సమీక్ష జరపాలని అన్నారు. ఓటర్ల పేర్లు తొలగింపునకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా సిపిఐ కమిటీ సభ్యులు కొప్పుల నాగరాజు, సిపిఎం నాయకులు తెల్లం దుర్గారావు, పోలవరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు టి రాణి, మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కె కుమారి, కె ఆనందరావు, కే వీరస్వామి, సవలం బాలరాజు, ఎం కామయ్య, లక్ష్మణరావు, పి వెంకటేశ్వరరావు, దాసరి రామారావు, సరిపల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com